Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, జూన్ 06, 2026 | సంపుటి - 20 | సంచిక 258 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

### యధాతథంగా ఆర్‌బిఐ
## కీలక వడ్డీరేట్లు

- ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ
- రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



ముంబై : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం 2లో



### నీటి ప్రాజెక్టుల పేరుతో
## బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

- కమిషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే
- కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కమిషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా..కూలింది
- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే
- పాలమూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కెసిఆర్ చేసింది శూన్యం
- గతంలో ఇబ్బడిముబ్బడి అప్పలతో మళ్లీ అప్ప పుట్టకండా చేశారు
- జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రెండోరోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్ : గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. 2లో



### పర్యావరణంతో సంబంధం
## లేదని అనలేం

- పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి
- కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిని మంత్రి పొన్నం

హైదరాబాద్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. తరువాయి 2లో






### హైదరాబాద్‌లో
## ఎబోలా కలకలం

ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు.



### పాలన చేతగాక పోతే
## రాజీనామా చేయండి

- ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా
- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా
- సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్

హైదరాబాద్ : పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు 2లో


### నిధులు, నియామకాలు,
## నీళ్లలో వైఫల్యం

- బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మహబూబాబాద్ : తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు 2లో

### ఆసక్తికరంగా తమిళనాడు
## రాజకీయాలు



- కొత్త పార్టీ పెటట్టబోతున్న అన్నామలై
- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా
- ఒంటరిగా పోటీచేయాలన్న తనవాదనను పట్టించుకోని బిజెపి
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై

చెన్నై : తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. 2లో

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం
## సైకిల్ తొక్కిన చంద్రబాబు

- ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
- ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు



విశాఖపట్నం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. తరువాయి 2లో



### పర్యావరణ పరిక్షణ
## అందరి బాధ్యత

విజయవాడలో సైకిల్ తొక్కిన హోంమంత్రి

విజయవాడ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నో వెహికల్ డే సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సహా ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కారు. అలానే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో తన నివాసం నుంచి ఆటోనగర్ ఫైర్ స్టేషన్ వరకు సైకిల్ తొక్కారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజూ ఓ గంట పాటు సైకిల్ తొక్కడం వల్ల ఓవైపు ఆరోగ్యం, మరోవైపు పర్యావరణం బాగుపడతాయని తెలిపారు. ప్రధాని పొదుపు మంత్రంలో భాగంగా సీఎం చంద్రబాబు తరువాయి 2లో

### సీ-ఫుడ్ ఉత్పత్తిలో
## ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

- ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి
- బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుంది
- సముద్ర ఉత్పత్తులకు కేంద్రం సహకారం ఉండాలి
- నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాపులో సిఎం చంద్రబాబు




విశాఖపట్టణం : భారతదేశంలో సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఏపీ నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విశాఖలో సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైంది. సీఎం చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆక్వా ఉత్పత్తుల నాణ్యతను పెంచుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోని మత్స్య సంపదలో 28 శాతం ఏపీ నుంచే వస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో 'నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్'పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తరువాయి 2లో

# యథాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్ఆర్ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.

## తృణమూల్ అధినేత్రికి మరో షాక్

**పార్లమెంట్ ఎంపిల్లోనూ తిరుగుబాటు**

**అభిషేక్ బెనర్జీ నాయకత్వాన్ని వ్యతిరేస్తున్న మెజార్టీ ఎంపిలు**

కోల్‌కతా,జూన్5 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. పార్టీ రెబల్ గ్రూప్ ఎమ్మెల్యలతో 23 మంది ఎంపీలు ప్రస్తుతం సంప్రదింపులు సాగిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు తాజాగా బాంబు పేల్చాయి. దీంతో రాబోయే రోజుల్లా టీఎంసీ పార్లమెంటరీ విభాగం నిట్టనిలువుగా చీలిపోయే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఇప్పటికే రెబల్ ఎమ్మెల్యేలు పట్టు సాధించారు. పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా 57 మంది టీఎంసీలు ఎమ్మెల్యేలు ఇటీవల ఎన్నుకున్నారు. ఆ ఎన్నికను స్పీకర్ రతీంద్ర బోస్ కూడా గుర్తించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు మమతా బెనర్జీని గౌరవిస్తున్నామని చెబుతూనే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ నాయకత్వాన్ని మాత్రం ఒప్పుకునేది లేదని కరాఖండిగా చెబుతున్నారు. తాజాగా టీఎంసీ ఎంపీల్లోనూ అసంతృప్తి పెల్లుబుకుతోంది. అభిషేక్ బెనర్జీ పట్ల పలువురు అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పాటేందుకు వీరు చర్చలు జరుపుతున్నారని, 12 మందికి పైగా ఎంపీలు ఇందుకు సముఖంగా ఉన్నారని అంటున్నాయి. టీఎంసీ పార్లమెంటరీ ప్రత్యేక కూటమిగా ఏర్పడేందుకు, చీలక తెచ్చేందుకు తగిన సంఖ్యాబలంపై కూడా చర్చ జరుగుతోందని చెబుతున్నారు. టీఎంసీకి లోక్‌సభలో ప్రస్తుతం 29 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా ఏర్పడి ఫిరాయింపుల చట్టం నుంచి వేటుపడకుండా ఉండాలంటే కనీసం 23 మంది మద్దతు ఇందుకు అవసరమవుతుంది. రాజ్యసభ పరంగా చూస్తే టీఎంసీకి 13 మంది ఎంపీలున్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే కనీసం 9 మంది ఎంపీలు కలిసిరావాలి. ఈ పరిణామాలపై రెబల్ నేత రీతాబత్ర బెనర్జీని ప్రశ్నించగా, గత వారం రోజుల్లో తాను ఏ ఎంపీతోనూ మాట్లాడలేదని, అందువల్ల వాళ్లు ఏమి చేయాలనుకుంటున్నారో తనకు తెలియదని చెప్పారు. అయితే రేపటిరోజు ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. దీనిపై వెటరన్ రాజ్యసభ ఎంపీ సుఖేందర్ శేఖర్ రాయ్ మాట్లాడుతూ, ఇంత తక్కువ సమయంలో 60 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం ఎప్పుడూ చూడలేదని, అదే స్పందన లోక్‌సభలోనూ ఉండే అవకాశాలు లేకపోలేదని అన్నారు.

# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్‌ఎస్ కోట్ల దోపిడీ

అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి.ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిసపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు. నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సిఎం వెంట మంత్రలుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం

# సైకిల్ తొక్కిన చంద్రబాబు

పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు. నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జ్‌ని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷-లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. నెట్ జీరో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా మని.. దీన్ని ఒక ఆదర్శంగా చేస్తామని సీఎం అన్నారు. నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా సైకిల్‌పై నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు.

# సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పదేళ్లలో 5 శాతం నుంచి 70 శాతం పెరుగుదల కనిపించింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి వెళ్లాం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలో ఏపీదే అగ్రస్థానం. రొయ్యల ఉత్పత్తిలో 66 శాతం, సీఫుడ్ ఆదాయంలో 38 శాతం మన రాష్ట్రం నుంచే వస్తోంది. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులు పెరిగేందుకు కేంద్రం అండగా నిలబడాలి. రొయ్యల ఉత్పత్తి మరింత పెరిగేందుకు ఏపీ అన్నివిధాలా అనుకూలం. విశాఖపట్నం, భీమవరం, కాకినాడ, నెల్లూరు, కృష్ణపట్నం ప్రాంతాలు ఆక్వా ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. రైతులు పొలాల్లో తీసిన కుంటలు కూడా సంపద సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఎప్పుడూ డోర్లు తెరిచే ఉంటాయి. వారు ఎప్పుడైనా నన్ను కలవొచ్చు.. ఫోన్ చేసి రావొచ్చని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టును ఆధునికీకరణ చేస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో ఇస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'భారతదేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతంగా ఉంది. దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ-ఫుడ్ ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులూ అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఏపీ ఆవిష్కరణలు చేస్తే భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో భారత్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఈ రంగంలో దేశానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి. ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవనదులు ఉన్నాయి. భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే' అని పేర్కొన్నారు. ఃూగా, ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

# ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కింటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. ఇదిలావుంటే అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# అర్ధరాత్రి ఇంట్లో పేలిని సిలిండర్

## అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి

నల్లగొండ,జూన్5 : నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశా నిర్దేశర మేరకు ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటిస్తున్నామని ఆమె వెల్లడించారు.'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రులందరం కాన్వాయ్ వెహికల్‌లను తగ్గించాం. అవకాశం ఉంటే పోలీసులంతా ఒకే వెహికల్లో వెళ్లే యోచన కూడా చేస్తాం. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. అందుకే ప్రజా ప్రతినిధులంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సైకిళ్లు తొక్కుతున్నాం' అని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్, బంగారం లాంటివి కొనుగోలు తగ్గించడం వల్ల విదేశీ మారక నిల్వలు పెరుగుతాయి. డాలర్‌తో రూపాయి విలువ తగ్గుతుంది. ఈ విషయాలను ప్రజలందరూ గమనించి పెట్రోల్, డీజిల్ వాడకాలు తగ్గించాలి. సైకిల్ తొక్కాలి అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎలాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపాటమెంట్ అధికారులు పాల్గొన్నారు.

# నిధులు, నియామకాలు, నీళ్లలో వైఫల్యం

సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు.రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# జార్ఖండ్‌లో కాంగ్రెస్‌కు జెఎంఎం ఝలక్

**రెండు రాజ్యసభ సీట్లకు అభ్యర్థుల ప్రకటన**

రాంచీ,జూన్5 : జార్ఖండ్‌లోని 'ఇండియా' కూటమిలో తాజాగా విభేదాలు పొడచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖండ్ నుంచి రెండు రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, రాష్ట్రంలో జేఎంఎం భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఒక సీటును ఆశిస్తోంది. పార్టీ నుంచి పోటీ చేసే రాజ్యసభ అభ్యర్థి పేరును ఇప్పటికే ప్రకటించింది.అయితే రెండు రాజ్యసభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు జేఎంఎం తాజాగా నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. దీనిపై భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై జేఎంఎం శాసనసభ్యులు, మంత్రులు, ఎంపీలు, సీనియర్ నేతలు శుక్రవారంనాడు సమావేశమయ్యారు. ఖాళీగా ఉన్న రెండు సీట్లలోనూ జేఎంఎం పోటీ చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం కుదరినట్టు సమావేశానంతరం రాష్ట్ర మంత్రి యోగేంద్ర మెహతో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కే అప్పగించినట్టు వివరించారు. ఈ క్రమంలో రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు భాగస్వామ్య పార్టీలతో సోరెన్ సంప్రదింపులు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఃూగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జార్ఖండ్ నుంచి పోటీ చేసే అభ్యర్థితో పాటు ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. భాగస్వామ్య పక్షంగా తమకు ఒక సీటును జేఎంఎం కేటాయిస్తుందనే అభిప్రాయంతో కాంగ్రెస్ ఉంది.

## సంపాదకీయం

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యవారణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యవారణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే  నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్ని, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల  కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం,  పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు.  గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# ప్రకృతి హెచ్చరికలు వినిపిస్తున్నాయా?



ఉదయం లేచినప్పుడు పక్షుల కిలకిలారావాలు వినిపించని గ్రామాలు పెరుగుతున్నాయి. వేసవి కాలం రాకముందే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. ఒకవైపు వరదలు, మరోవైపు కరువు. ఎప్పుడో ఒకప్పుడు శాశ్వతంగా కనిపించిన నదులు సీజనల్ వాగులుగా మారుతున్నాయి. అడవులు తగ్గుతున్నాయి. గాలి కాలుష్యం పెరుగుతోంది. ఇవి ప్రకృతి కోపం కాదు. ఇవి ప్రకృతి పంపుతున్న హెచ్చరికలు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 మనకు మరోసారి గుర్తుచేస్తున్న సత్యం ఏమిటంటే పర్యావరణాన్ని కాపాడటం అనేది కేవలం చెట్లు నాటడం కాదు; అది మన భవిష్యత్తును కాపాడుకోవడం. అభివృద్ధి పేరుతో ప్రకృతిని కోల్పోతున్నామా? గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచం అపూర్వమైన ఆర్థిక అభివృద్ధిని సాధించింది. నగరాలు విస్తరించాయి. పరిశ్రమలు పెరిగాయి. సాంకేతికత అద్భుతాలు సృష్టించింది. కానీ ఈ అభివృద్ధికి ప్రకృతి చెల్లించిన మూల్యం చాలా పెద్దది. అడవుల నరికివేత, భూగర్భ జలాల అధిక వినియోగం, ప్లాస్టిక్ కాలుష్యం, బొగు, చమురు వంటి ఇంధనాలపై ఆధారపడటం వల్ల భూమి ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. వాతావరణ మార్పు ఇక భవిష్యత్ సమస్య కాదు. అది వర్తమాన వాస్తవం. వాతావరణ మార్పులకు కారణమైన వారు చాలాసార్లు దాని ప్రభావాన్ని తక్కువగా అనుభవిస్తారు. కానీ అత్యంత పేదలు, రైతులు, గిరిజనులు, మత్స్యకారులు, గ్రామీణ ప్రజలే ఎక్కువగా నష్టపోతున్నారు. వర్షాలు సక్రమంగా పడక పంటలు నష్టపోతున్నాయి. అడవులపై ఆధారపడిన గిరిజన కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతున్నాయి. నీటి కొరతతో గ్రామాలు ఇబ్బందులు పడుతున్నాయి. పర్యావరణ సంక్షోభం కేవలం ప్రకృతి సమస్య కాదు; అది సామాజిక, ఆర్థిక, మానవతా సమస్య కూడా. ప్రకృతితో పోరాటం కాదు, సహజీవనం అవసరం మన పూర్వీకులు ప్రకృతిని వనరుగా మాత్రమే చూడలేదు; జీవన భాగస్వామిగా చూశారు. చెట్టును దేవుడిగా, నదిని తల్లిగా, భూమిని పోషకురాలిగా భావించారు. నేడు ఆ దృక్పథాన్ని మళ్లీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. అడవులను కాపాడటం, నీటి వనరులను పునరుద్ధరించడం, స్థానిక విత్తనాలను ప్రోత్సహించడం, రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక శక్తిని ఉపయోగించడం వంటి చర్యలు కేవలం పర్యావరణానికి కాదు, మన ఆర్థిక భవిష్యత్తుకు కూడా పెట్టుబడులే.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730**



న్యూఢిల్లీ :  భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కోత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది. ఇక నగరంలో కిలో వెండి ధరలో రూ.5 వేల మేర కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.8 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.350ల మేర తగ్గింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,960గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,42,750గా ఉంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,880గా, 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,444 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

# మాజీ ప్రియురాలి దారుణ హత్య

**కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన దుండగుడు**
**అనంతరం అదే కత్తితో పొడుచుకున్న దుర్మార్గుడు**
**యువతి మృతి..యువకుడి పరిస్థితి విషమం**

చండీఘడ్,జూన్5 :  పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతి మాజీ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. మాజీ ప్రియుడు ఆ యువతిని 20 సార్లు కత్తితో పొడిచి చంపాడు. యువతిని చంపిన తర్వాత అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మొహాలికి చెందిన హర్వీందర్ మన్ అలియాస్ హ్యారీ, డింపుల్ మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో కలిసి పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పడింది.  పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ కొత్త కంపెనీలో చేరారు. కొత్త కంపెనీలో చేరిన కొంతకాలం వీరి బంధం సజావుగానే సాగింది. తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరూ విడిపోయారు. డింపుల్‌తో విడిపోవటం హ్యారీకి ఇష్టం లేదు. మళ్లీ ఆమెతో ఒక్కడవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. డింపుల్ ఇందుకు ఒప్పుకోవటం లేదు. దీంతో అతడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. గురువారం డింపుల్ డ్యూటీలో ఉండగా.. రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హ్యారీ ఆఫీస్‌కు వచ్చాడు. ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కత్తితో డింపుల్‌ను 20 సార్లు అతి కిరాతకంగా పొడిచాడు. తర్వాత అదే కత్తితో తన గొంతులో 30 సార్లు పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరినీ సహోద్యోగులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. డింపుల్‌ను పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు. హ్యారీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.


# వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

**శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ**

తిరుపతి,జూన్5 :  తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# సమస్యలకు భగవద్గీతతో సమాధానం



తిరుమల : కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకి సందిగ్దతకి సమాధానంగా భగవద్గీత ఈ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది, ఏ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది. ఏ పని ఎట్లా చేయాలి, ఎంత వరకు చేయాలి అనే సంశయం కలిగిన వ్యక్తికి ఒక శ్రేయ సాధనంగా భగవద్గీత ఉపయోగపడుతుంది. నాకు కర్తవ్యం ఏమితే తెలియట్లేదు కానీ, 'ఏ శ్రేయస్యం నిశ్చితం భూహితన్మే' నేను శ్రేయస్సుని కోరుకుంటున్నాను, నాకేది శ్రేయస్సో అది చెప్పు అని అర్జునుడు అడిగినది. శ్రేయస్సుని పొందాలి అనుకున్నవాడికే ఏమైనా చెప్పడం అవసరం, ఆ శ్రేయస్సు కోరే వ్యక్తి ఏ స్తాయిలో ఉన్నా అందరికి అందేలా శ్రీకృష్ణ భగవానుడు అందించిన ఉపదేశమే భగవద్గీత.  అది వ్యక్తి గతంగా చిన్న స్థాయిలో కావచ్చు, యువ స్థాయిలో కావచ్చు, ఒక గృహస్తుగా జీవించే వ్యక్తి స్థాయిలో కావచ్చు, లేక వ్యాపారమో, వాణిజ్యమో, ఔద్యోగికమో ఏదో రకమైన శ్రేయస్సుని పొందాలి, అది అత్మోజ్జీవనకరమై ఉండాలి అనే వ్యక్తికి భగవంతుడు చేసిన అతి శక్తి వంతమైన ఉపదేశమే శ్రీమద్భగ వద్గీత.మనకూ సంశయాలు తీరుతాయి, చేయాల్సిన కర్తవ్యం గుర్తితాం. చేసే తెలివి కలుగుతుంది. జీవితాన్ని సుఖమయం చేసుకుంటాం. ఉపద్రవాలు వస్తూనే ఉంటాయి, అవి ఉపశమించాలి, అపన్నులైన వ్యక్తులను ఆదుకొనే హృదయ సౌకుమార్యం ఏర్పడాలి. మనం చెదరకుండా ఉండేందుకు మనో ధైర్యం ఏర్పడాలి. ఇవన్నీ కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.

ఆధ్యాత్మికం

# భూ నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం

● చట్ట ప్రకారం పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది ● ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం ● రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, జూన్ 5, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధికి భూనిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగుతామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.
శుక్రవారం ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధి, పుష్కర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులు, భూనిర్వాసితులతో మంత్రి శుక్రవారం ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ నిర్వాసితుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి ముందుకు సాగుతామని తెలిపారు. 2017 - 18 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలు ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయమని మంత్రి అన్నారు. ఇప్పటికే పలుమార్లు భూ నిర్వాసితులతో నెలలుగా చర్చలు జరిపామని శనివారం మరో దఫా చర్చలు నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి క్షేత్ర అభివృద్ధి కోరకు స్థానికులంతా సహకరించాలని ఎవరు క్షేత్ర అభివృద్ధిలో రాజకీయాలు చేయద్దని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని అభివృద్ధి విషయంలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మంత్రి కోరారు. దేశం నలుమూలల నుండి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు సేకరిస్తున్న భూములు, ఇల్లు కోల్పోతున్న వారు పెద్ద మనసుతో సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2027 జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మొదటి విడతగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటి లింగాలకు రూ. 117 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటాయించారని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బైపాస్ రోడ్లు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. మరిన్ని సౌకర్యాల కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని త్వరలోనే నిధులు సాధించి పుష్కరాలకు ముందే పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మితో పాటు దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైభవంగా కుంకుమ పూజ

## - రేపటితో ముగియనున్న ఆధ్యాత్మిక ఉత్సవాలు





**సుల్తానాబాద్, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టి టి డి ) ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం స్థానిక మహిళలచే లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి వల్లకొండ మఠం మహేష్ ఈ పూజను శాస్త్రోక్తంగా జరిపించగా, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గడిచిన మూడు రోజులుగా ప్రముఖ ప్రవచనకర్త అల్లంకి వైకుంఠం భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. భక్తుడికి, భగవంతుడికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ, నిష్కల్మషమైన భక్తి మార్గం ద్వారానే భగవంతుడిని చేరుకోగలమని ఆయన ప్రవచించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ధర్మాచార్యులు మెంగని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల ప్రజలకు భక్తిభావాన్ని, సంస్కృతిని చేరవేసేందుకే టీటీడీ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇంతటి మంచి అవకాశాన్ని కల్పించిన వరంగల్-కరీంనగర్ ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తికి గ్రామ ప్రజల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆలయ చైర్మన్ మారుతి, పూజారి మహేష్, ప్రవచనకర్త వైకుంఠంలను చంద్రశేఖర్ శాలువాతో సత్కరించారు. అలాగే ఆలయ కమిటీ ప్రతినిధులు ధర్మాచార్యులు చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ నెల 2 నుండి ప్రారంభమైన ఈ ఐదు రోజుల ఆధ్యాత్మిక ఉత్సవాలు శనివారం ఉదయం 8 గంటలకు నిర్వహించే 'నగర సంకీర్తన' కార్యక్రమంతో ముగియనున్నాయి. ఈ ముగింపు వేడుకలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ధర్మాచార్యులు చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు కొమురవెల్లి భాస్కర్, అల్లంకి ఆనందం, సత్యనారాయణ, పల్ల కిషన్, లెక్కల శంకరయ్య మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కావాలి..





**బ్యూరో చీఫ్ (ది క్రైమ్ న్యూస్):** పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, ప్రజలతో మమేకమై అవగాహన కల్పించి పర్యావరణ రక్షణకై వారిని చైతన్యం చేయాలని జిల్లా యువజన అధికారి గోలి తిరుపతిరెడ్డి అన్నారు. ప్రతి సంవత్సరం జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విస్తరణ యువతలో పర్యావరణ చైతన్యం పెంపొందించే లక్ష్యంతో నారి శక్తి యూత్ క్లబ్, జ్యోతినగర్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన అధికారి గోలి తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. పచ్చదనం పెంపుతో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆదరణ సేవా సమితి ఎన్‌జీఓ అధ్యక్షురాలు కర్రె పావని ప్రత్యేక అతిథిగా పాల్గొని పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఎస్.ఆర్. డిజి జోనల్ ఇన్చార్జ్ సచిన్, స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాణి అతిథిగా పాల్గొని విద్యార్థులు ప్రకృతిని ప్రేమించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు సామాజిక కార్యకర్తలు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఒక్క మొక్క భవిష్యత్ తరాలకు గొప్ప బహుమతి అనే సందేశంతో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో నారి శక్తి యూత్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కవలలు హర్షిత్ షాన్ పాల్, ఇవాన్ పాల్





**పటాన్చెరు, జూన్ 05(ది క్రైమ్ న్యూస్) :** సంగారెడ్డికి చెందిన 9 సంవత్సరాల చిన్నారులు హర్షిత్ షాన్ పాల్, హర్షిత్ ఐవన్ పాల్ కీబోర్డ్ వాయిద్యంలో తమ ప్రతిభను చాటుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు.
చిన్న వయస్సులోనే సంగీతంపై ప్రత్యేక ఆసక్తి చూపిన ఈ చిన్నారులు అరుదైన ఘనతను సాధించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ఫిబ్రవరి 2, 2026న సికింద్రాబాద్‌లోని జోరాస్ట్రియన్ క్లబ్‌లో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో 22 దేశాల నుంచి వచ్చిన సుమారు 2000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొన్నారు. వీరిలో 777 మంది వాద్యకారులు ఒక గంట పాటు ఏకకాలంలో కీబోర్డ్ వాయించి గిన్నిస్ రికార్డు సాధించగా, వారిలో హర్షిత్ షాన్ పాల్, హర్షిల్ ఐవన్ పాల్ కూడా స్థానం సంపాదించారు.
ఈ ఘనతను పురస్కరించుకుని మే 29, 2026న గిన్నిస్ అచీవర్స్ మీట్ నిర్వహించి, రికార్డు సాధించిన విద్యార్థులకు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పాస్టర్ ఆగస్టిన్ దండింగి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జూన్ 4, 2026న ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన హర్షిత్ షాన్ పాల్, హర్షిల్ ఐవన్ పాల్‌తో పాటు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులను పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు వరంగల్ రవి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీత గురువులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, ఈ ప్రయాణం హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ పాస్టర్ ఆగస్టిన్ దండింగి చూపిన దూరదృష్టితో ప్రారంభమైందని అన్నారు. ఆగస్టిన్ దండింగి ఉచిత కీబోర్డ్ తరగతులను ప్రారంభించారని, చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి నిరంతరం ప్రోత్సహించారని తెలిపారు. ప్రోత్సాహం వల్లే ఈ చిన్నారులు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించే స్థాయికి ఎదిగారని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. హర్షిత్ షాన్ పాల్, హర్షిల్ ఐవన్ పాల్ సంగీత రంగంలో మరింతగా ఎదిగి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ గుర్తింపులు సాధించి హైదరాబాద్‌కు, తెలంగాణకు, మన దేశం భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని పెద్దలు ఆకాంక్షించారు.

# కరీంనగర్‌లో ఘనంగా రెండు ఫార్మసీల ప్రారంభం





**కరీంనగర్ టౌన్, జూన్ 05(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో వైద్య సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. నగరంలోని లక్ష్మీ నగర్‌లో ఏర్పాటు చేసిన 'మెగా కేర్ ఫార్మసీ', అశోక్ నగర్‌లో ఏర్పాటు చేసిన 'సిటీ కేర్ ఫార్మసీ'లను కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ నేడు ఘనంగా ప్రారంభించారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి ఆయన ఈ రెండు ఫార్మసీల రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ధరల్లో, నాణ్యమైన మందులను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ షేక్ యూసుఫ్, డివిజన్ నాయకులు నేతి రవి వర్మ, కర్ర సూర్య శేఖర్, గూడెల్లి రాజ్ కుమార్, జెల్లోజీ హరి కృష్ణ పాల్గొన్నారు. అలాగే ఫార్మసీ నిర్వాహకులు ఈ.సత్యనారాయణ, అజయ్, సుమన్, సాగర్, అనిల్, నరేష్‌లతో పాటు పలువురు స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# భగత్ నగర్‌లో ఘనంగా 'మాకూన్స్ కిడ్స్ అన్‌ప్లగ్డ్' ప్రీ-స్కూల్ ప్రారంభోత్సవం





**కరీంనగర్ టౌన్, జూన్ 05(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని భగత్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'మాకూన్స్ సెఫైర్ కిడ్స్ అన్‌ప్లగ్డ్' ప్రీ-స్కూల్, డేకేర్, యాక్టివిటీ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ నూతన కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల మానసిక, శారీరక సమగ్ర వికాసానికి ఇలాంటి ఆధునిక విద్యా ప్రమాణాలు కలిగిన ప్రీ-స్కూల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని కొనియాడారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు యాజమాన్యం తీసుకున్న చొరవను వారు అభినందించారు. ఈ ఘన శోభాయమాన కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ నాంపల్లి రేణుక-శ్రీనివాస్, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ-వేణు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందంతో పాటు భగత్ నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన పెద్ద సంఖ్యలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులకు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దళితుల ఇనాం భూములపై కబ్జా యత్నాలు!

## రాజకీయ అండతో ఆక్రమణల ఆరోపణలు.. చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్..



**కొంపల్లి, జూన్ 3: (ది క్రైమ్ న్యూస్):** దుండిగల్ గండి మైసమ్మ మండలం దూలపల్లి పరిధిలోని దళితుల ఇనాం భూములపై కబ్జా యత్నాలు జరుగుతున్నాయంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్లు 39, 150లో ఉన్న భూములను రాజకీయ అండదండలతో కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. భూములను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిని బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతోందని స్థానికులు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా స్పందించడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. దళితుల భూములకు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు.

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలి

## ● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్...

**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్):** నియోజకవర్గ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి, దేవేందర్ నగర్ ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో ఉన్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో పాటు లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ, ఇంజనీరింగ్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొని సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకత్వంలో సకల సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి వేలాది కుటుంబాలకు అందజేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ కాలనీల్లో అవసరమైన కనీస మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు సౌకర్యవంతంగా జీవించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్, వీధిదీపాలు, రహదారులు, రవాణా సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా రోజుకు రెండు సార్లు తాగునీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నెంబర్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజల ఆధ్యాత్మిక అవసరాల కోసం దేవాలయం, మసీదు, చర్చి, వైకుంఠ ధామాల నిర్మాణానికి తగిన స్థలాలను





కేటాయించాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శవంతమైన నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ సంక్షేమ సంఘాల నాయకులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## ● అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ అత్యంత అవసరమని అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని రంగంపల్లి జిల్లా కోర్టు సముదాయంలో అదనపు జిల్లా న్యాయమూర్తి కె. స్వప్న రాణి, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల ఆధ్వర్యంలో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి కే.స్వప్న రాణి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.అనంతరం భూపాలపల్లి జిల్లా అటవీ అధికారి, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్ అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ప్రాంతీయ కార్యాలయ సహాయ శాస్త్రవేత్త ఈ. కనక జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐడీఓసీ కార్యాలయం నుంచి ఖిలావనపర్తి గ్రామం వరకు అటవీ శాఖ సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మారం మండలంలోని ఖిలావనపర్తి రాంపల్లి రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్‌లోని కాంపార్ట్‌మెంట్ నెం.479/1 వద్ద రెండు



హెక్టార్ల అధిక సాంద్రత మిశ్రమ మొక్కల పెంపకం ప్రాంతంలో ప్రత్యేక మొక్కల నాటకం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కోర్టు సముదాయంలో 30 మొక్కలు, ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో 10 మొక్కలు, ఖిలావనపర్తి ప్రాంతంలో 20 మొక్కలు నాటారు.ఈ కార్యక్రమాల్లో అటవీ శాఖ అధికారులు, టి. సతీష్ కుమార్, వినయ్ నాయక్, దేవదాస్, రమేష్, కొమురయ్య, రహమతుల్లా, ఖిలావనపర్తి సర్పంచ్ మోతే కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబం షెడ్ తొలగింపుపై టీజేఎస్ ఆగ్రహం..

## ● కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని టీజేఎస్ పటాన్‌చెరు ఇన్‌చార్జ్ హనుమంత్ రెడ్డి డిమాండ్

**పటాన్చెరు(అమీన్పూర్), జూన్ 05(ది క్రైమ్ న్యూస్ ):** అమీన్పూర్ డివిజన్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ చర్యల కారణంగా ఒక పేద కుటుంబం రోడ్డున పడిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమంత్ రెడ్డి ఆరోపించారు. రిజిస్ట్రేషన్ ఉన్న ప్లాట్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా వారు నిర్మించుకున్న షెడ్‌ను తొలగించడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి జరిగిన నష్టానికి కమిషనర్ బాధ్యత వహించి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. షెడ్ తొలగింపుకు సంబంధించి



చట్టబద్ధమైన ఆధారాలు ఉంటే ప్రజలకు వెల్లడించాలని, లేకపోతే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా కేవలం ఒక పేద కుటుంబాన్ని



లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం సరైంది కాదన్నారు. బడుగు, బలహీన వర్గాలపై మాత్రమే అధికార ప్రతాపం చూపించడం బాధాకరమని పేర్కొన్నారు. కమిషనర్‌పై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని టీజేఎస్ పార్టీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హనుమంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

## ● టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడేషన్ కార్డులు అందివ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ లోని డి పి ఆర్ ఓ కార్యాలయంలో ఇన్చార్జి డి పి ఆర్ ఓ ఆయుబ్ ఖాన్ ను టి యు డబ్ల్యూ జే ( టి జే ఎఫ్) జర్నలిస్టుల బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జే ( టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా జర్నలిజం రంగాన్ని నమ్ముకుని వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్నారని, ప్రధానంగా చిన్న, మధ్య తరగతి పత్రికలకు సంబంధించిన జర్నలిస్టులకు ప్రధాన పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టులతో పాటుగా అందరికీ ఒకేసారి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. తప్పుడు ఫిర్యాదులు చేసే వారి పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న, మధ్య తరగతి, డెస్క్, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్, శాటిలైట్ వివిధ విభాగాలలో పనిచేస్తున్న అర్హత కలిగిన జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డులు సకాలంలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కమిటీ మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు తక్షణమే అక్రిడేషన్ కార్డులు ఒకేసారి విడుదల చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వనం నాగయ్య, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యాలమందల జగదీష్, నగర ప్రధాన కార్యదర్శి అమరపు కోటేశ్వరరావు, ఖమ్మం ప్రెస్



క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి ఉపాధ్యక్షులు, ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ సెక్రెటరీ ఎస్. వెంకటేశ్వర రెడ్డి, సహాయ మూల జీవన్ రెడ్డి, మురళి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, సంతోష్, యాదగిరి, నాగశేఖర్ ,రవీందర్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, పాశం వెంకటేశ్వర్లు, కళ్యాణ్ , సాయి, లింగయ్య, గౌరీ శంకర్, రాంబాబు, శ్రీనివాస్, సీతారాములు, సంజీవరెడ్డి, నరసయ్య, రామ్ ఎస్ వి రెడ్డి, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధితోనే దేశ ప్రగతి: హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, (ది క్రైమ్ న్యూస్ )మే 14 :** మహిళలు సమాజానికి వెన్నెముకలని, వారి అభివృద్ధి లేకుండా దేశ ప్రగతి సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. 292 డివిజన్ సాయిబాబా నగర్‌లో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళల హక్కులు, సంక్షేమం, సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడ్చల్- మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన స్వావలంబన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు రాజకీయ పార్టీలపై కూడా ఉందన్నారు. మహిళల సంక్షేమం, హక్కుల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు చీరాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా టాపర్‌కు రూ.50 వేల ప్రోత్సాహం...





**కుత్బుల్లాపూర్. (ది క్రైమ్ న్యూస్):** నియోజకవర్గం భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి లక్ష్మీనారాయణకు రూ.50 వేల నగదు పురస్కారం అందజేశారు. మండల స్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30 వేల బహుమతి ప్రదానం చేశారు. 500కు పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున, 490కు పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నాయకులు మన్నే శేఖర్ ముదిరాజ్, మిద్దెల మల్లారెడ్డి, కటకం విరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గండిపేట భూకబ్జా కుట్ర..

## ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడు అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గండిపేట మండలంలోని ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుమారు 10ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు రెవెన్యూ రికార్డులు సృష్టించిన కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడిని నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అధికారులు అరెస్ట్ చేశారు. గండిపేట మండలం సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ భూమిని అక్రమంగా రెగ్యులరైజేషన్ చేయించుకునేందుకు నకిలీ జీవోలు, తప్పుడు అధికారిక పత్రాలు రూపొందించినట్లు గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 23న నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 990/2026 కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే నిమ్మల కుటుంబ సభ్యులు, రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రభీన్ కుమార్ సహా పలువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిని పోలీస్ కస్టడీలోకి తీసుకుని విచారించారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం బొల్లా బ్రహ్మానాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు పరస్పర కుమ్మక్కై ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు నకిలీ జీవోలు, తప్పుడు ప్రభుత్వ అనుమతులు, నకిలీ రెవెన్యూ రికార్డులు సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కుట్రలో భాగంగా బొల్లా బ్రహ్మానాయుడు సుమారు రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. నిమ్మల కుటుంబ సభ్యులకు రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతర సంబంధిత వ్యక్తులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నిధులను నకిలీ పత్రాల తయారీ, భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు వినియోగించినట్లు గుర్తించారు. అరెస్టుకు ముందు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన బొల్లా బ్రహ్మానాయుడు పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. అనంతరం పరారీలో ఉన్న అతడిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగగా, తమిళనాడులోని కాంచీపురంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బొల్లా బ్రహ్మానాయుడు పోలీసుల అదుపులో ఉండగా, న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు. కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నకిలీ పత్రాల తయారీ, ప్రభుత్వ అధికారుల పేర్లు, సంతకాల దుర్వినియోగం, అలాగే కుట్రలో పాల్గొన్న ఇతర వ్యక్తుల పాత్రలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పూర్తి స్థాయిలో వరి ధాన్యాన్ని గోదాములో నిల్వ చేస్తాం

● వంద శాతం కొనుగోలు కేంద్రాల నుండి తరలించేందుకు చర్యలు ● తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సి హెచ్. విజయ రమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాల ఆదుకుంటుందని రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేసి పూర్తిస్థాయిలో గోదాములలో నిల్వ చేస్తామని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో గల రైస్ మిల్లు గోదాంలో నిల్వచేసిన వరి ధాన్యాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు సెంటర్ లో ఉన్న వరి ధాన్యం 98% తరలించామని పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో లారీల జాప్యం హమాలీల కొరత తో అక్కడక్కడ కొంతమేర మిగిలి ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు పెద్దపల్లి, సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ భారీ, తిరుపతి, శ్రీనివాస్, సతీష్ లతో మాట్లాడి పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్, రంజిత్ ఎస్ ఐ లు పోలీసులు, అధికారుల సహకారంతో పూర్తిస్థాయిలో తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హమాలీల కొరత లేకుండా మరి కొంతమంది హమాలీలతో మాట్లాడామని పెద్ద కల్వల సంతు, నరేష్ లు రాత్రి సమయంలో కూడా వారి సహకారంతో పూర్తిస్థాయిలో రెండు మూడు రోజులలో ధాన్యాన్ని లిఫ్ట్ చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి లలో అక్కడక్కడ కొన్నిచోట్ల మిగిలిపోయిన ధాన్యాన్ని రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో లిఫ్ట్ చేస్తామని తెలిపారు. కేరళకు రుతుపవనాలు తాకాయని త్వరితగతిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో తరలిస్తామని అలాగే మక్కాలను సైతం నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో కొనుగోలు చేపట్టామని అవి ఎక్కడికి తరలించాలో అక్కడికి తరలించామని తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాలలో నాలుగు కోట్ల రూపాయలు జమ అయ్యాయని మిగిలిన రూపాయలు సైతం త్వరలోనే రైతుల ఖాతాలో జమ కానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, పలు గ్రామాల సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారులకు టీజేఎఫ్ జర్నలిస్టుల బృందం వినతి

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు డి ఈ ఓ, డిఐఈ ఓ జిల్లా విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్, వెబ్, కేబుల్, డెస్క్, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ ల తో పాటు వివిధ విభాగాలలో వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయం సూపరింటెండెంట్ నాగజ్యోతి లకు వారి కార్యాలయాలలో శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే జర్నలిస్టులు ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తూ ఉంటారని, వారి పిల్లలకు ప్రవేట్, ఎయిడెడ్, పాఠశాలలు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. గత అనేక సంవత్సరాలుగా జర్నలిస్టు పిల్లలకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ సర్కులర్ జారి చేసే వారిని దీని ఫలితంగా అనేక మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరిందని, 2026 - 27 విద్యా సంవత్సరానికి కూడా ఇటు డిఇఓ, అటు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి సర్కులర్లను విడుదల చేసి జర్నలిస్టు పిల్లలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వనం నాగయ్య, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యాలమందల జగదీష్, నగర ప్రధాన కార్యదర్శి అమరపు కోటేశ్వరరావు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి ఉపాధ్యక్షులు, ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ సెక్రెటరీ ఎస్. వెంకటేశ్వర రెడ్డి, సహాయ మూల జీవన్ రెడ్డి, మురళి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, ఉల్లోజు





రమేష్, నల్లమోతు శ్రీనివాస్, సంతోష్, యాదగిరి, నాగశేఖర్ ,రవీందర్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, పాశం వెంకటేశ్వర్లు, కళ్యాణ్, సాయి, లింగయ్య, గౌరీ శంకర్, రాంబాబు, శ్రీనివాస్, సీతారాములు, సంజీవరెడ్డి, నరసయ్య, రామ్ ఎస్ వి రెడ్డి, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా సివిరేజ్ లైను, త్రాగునీరు లైను, వేసి సీసీ రోడ్డు పనులను ప్రారంభం





**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** హిమాయత్ నగర్ డివిజన్‌లో ఉన్న బగ్గి ఖానాలో నూతనంగా సివిరేజ్ లైను, త్రాగునీరు లైను, వేసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగింది. అయితే అక్కడున్న కొంతమంది స్థానికులు వారి ఇంటి వరకు సిసి రోడ్ రావడంలేదని హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టికి తేవడంతో వారి ఆదేశాల మేరకు ఈరోజు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్గౌడ్ మున్సిపల్ అధికారి మరియు కాంట్రాక్టర్లు తీసుకొని అక్కడ పర్యటించి సమస్యను తెలుసుకోవడం జరిగింది. ఈ మేరకు వారు ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్‌కి ఈ విషయాన్ని తెలియచేసి ఎమ్మెల్యే సహకారంతో అదనపు బడ్జెట్ తో ఆ రోడ్డు పని కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు ఈ ఆశ్వాసాన్ని విని స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌కి మరియు మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రతి చిన్న గల్లీలో గాని ఎటువంటి సమస్య ఉంటే వాటిని తీర్చడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ సీనియర్ నాయకులు పూర్ణచందర్, జోసఫ్, నదీమ్ మరియు కాంగ్రెస్ నాయకులు జైస్వాల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో ఉన్న విశ్వామిత్ర పార్క్‌లో ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిఎంసీ కమిషనర్ సృజన, అడిషనల్ కమిషనర్ సుబద్ర, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ప్రకృతి వనరుల క్షీణత మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యవసరమని పేర్కొన్నారు. “పర్యావరణాన్ని కాపాడుదాం -- భవిష్యత్తును రక్షిద్దాం”, “ఒక్క మొక్క ఎన్నో ప్రాణాలకు ఆధారం”, “ప్రకృతి మన సంపద -- పరిరక్షణ మన బాధ్యత” అంటూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు, కాలనీలు, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, వాతావరణ మార్పులపై చైతన్యం కల్పించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం, అలాగే నీరు, గాలి, నేల కాలుష్యాన్ని నివారించడం అని వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా లేదా సైకిళ్లను ఉపయోగించడం, చెత్తను వేర్వేరుగా సేకరించి రీసైక్లింగ్ చేయడం వంటి చర్యలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. ప్రపంచ మానవాళికి మొక్కలే జీవనాధారమని, ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూబీడీ అధికారి విక్రమ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తులసిరెడ్డికి ఘన సన్మానం...



**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్),** నియోజకవర్గ పరిధిలోని భౌరంపేట్ గ్రామానికి చెందిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డి ప్రపంచంలోనే ఎత్తయిన వీశీబత్ జుజవతీవర్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి స్వగ్రామానికి చేరుకోగా గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తులసిరెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. గ్రామానికి, ప్రాంతానికి తులసిరెడ్డి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మిద్దెల యాదిరెడ్డి, పల్పునూరి పద్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి (చింటు), పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, పల్పునూరి బల్వంత్ రెడ్డి, గుర్రాల శ్రీకాంత్ రెడ్డి, కుటుంబ సభ్యులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జి దుర్గం గణేశ్



**సుల్తానాబాద్, జూన్ 5(ది క్రైమ్ న్యూస్):** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి జడ్జి గణేశ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి లభించిన విలువైన సంపద పర్యావరణం అని, దానిని భద్రంగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రకృతిని మనం కాపాడితే.. అది మనల్ని కాపాడుతుందని, సహజ వనరుల సంపదను భవిష్యత్ తరాల కోసం సంరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి మొక్కలను నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆవుల శివకృష్ణ, ఎజిపి దూడం ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు మాడూరి ఆంజనేయులు, పడాల శ్రీరాములు, జోగుల రమేష్, పెగడ శ్యామ్ సుందర్, సామల రాజేంద్ర ప్రసాద్, గుడ్ల వెంకటేష్, మల్యాల కరుణాకర్, ఆకారపు రామకృష్ణ రెడ్డి, మాదూరి పృథ్వీ, గండి శ్రీనివాస్ , కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికి ఆహుతైన టేకు వనం ప్రభుత్వ సాయానికి రైతు విజ్ఞప్తి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 3.12ఎకరాల విస్తీర్ణంలో ఉన్న టేకు వనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రైతు కొండి కొమరయ్యకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, కొమరయ్య 16 సంవత్సరాల క్రితం సుమారు రూ.40 లక్షల పెట్టుబడితో తన వ్యవసాయ భూమిలో 2,300 టేకు మొక్కలను నాటారు.ఎన్నో ఏళ్లుగా సంరక్షిస్తూ పెంచుకున్న ఈ టేకు వనం గురువారం రాత్రి అకస్మాత్తుగా చెలరేగిన మంటల కారణంగా పూర్తిగా కాలిపోయింది. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో సుమారు రూ.1 కోటి మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. జీవితకాల శ్రమతో పెంచుకున్న టేకువనం క్షణాల్లో బూడిద కావడంతో రైతు కుటుంబం తీవ్రఆవేదనవ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, తగిన పరిహారం అందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కొండి కొమరయ్య ప్రభుత్వాన్ని కోరారు.స్థానిక రైతులు,గ్రామస్తులు కూడా బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థికసహాయంఅందించాలనివిజ్ఞప్తి చేస్తున్నారు.


# మసీదుబండలో పర్యావరణ దినోత్సవ వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండ కుడికుంట చెరువు వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ప్రకృతి వనరుల క్షీణత నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యవసరమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని ఆదా చేయడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూబీడీ అధికారులు విక్రమ్, నాయకులు మారబోయిన రాజు యాదవ్, గణేష్ ముదిరాజ్, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మోడీ పాలన 12 ఏళ్లు పూర్తి..

## • బోడుప్పల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో హరిత కార్యక్రమం • పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత






**బోడుప్పల్, జూన్ 5(ది క్రైమ్ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం12 సంవత్సరాల విజయవంతమైన పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా,అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ బోడుప్పల్ డివిజన్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు తలారి రవి అధ్యక్షతన,ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కమిటీ బోడుప్పల్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీను,జిల్లా కార్యదర్శి పద్మ మహేశ్వర్ రెడ్డి,జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సంధ్యారెడ్డిలు హాజరయ్యారు. అనంతరం వీరారెడ్డి నగర్ కాలనీలో మొక్కలు నాటి,వాటి సంరక్షణకు కట్టుబడి ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన, హరిత భారతదేశాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని నాయకులు సూచించారు. ఏక్ పెడ్ మాకే నామ్' కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు పర్యావరణ పరిరక్షణ కమిటీ కృషి చేస్తోందని కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కో-కన్వీనర్లు గొల్లపూడి శ్రీనివాస్ రావు, బెజాడి బ్రహ్మం, మునిపాల పురుషోత్తంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భానుగుంట వేణుగోపాల్, జిల్లా ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ వేమునూరి మురళీధర్, మహిళా మోర్చా వైస్ ప్రెసిడెంట్ ఆదిమూలం రమాదేవి, కార్యదర్శులు రోజా, తిరుమలేష్, బీజేవైఎం జనరల్ సెక్రటరీ ధర్మపురి అరవింద్, బీజేవైఎం నాయకుడు వంశీ, జిల్లా ఎండోమెంట్ కో-కన్వీనర్ కే.శ్రీనివాస్ ముదిరాజ్, ఈస్ట్ జోన్ వైస్ ప్రెసిడెంట్ ధర్మారెడ్డి, సీనియర్ నాయకుడు ఆర్.వేణుగోపాల్, బూత్ అధ్యక్షుడు పత్తి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై హమాలీల వేతనం ఒప్పందం కై నేడు చలో హైదరాబాద్




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో సివిల్ సప్లై పాయింట్స్ లలో సుమారు 5,000 మంది హమాలీలు మరియు కార్మికులు పనిచేస్తున్నారని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన ఒప్పందం జరుగుతుందని, 2025 డిసెంబర్ నాటికి వేతన ఒప్పందం ముగిసిందని, 2026 జనవరి నుంచి నూతన వేతన ఒప్పందం అమలు కావాలి డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల హమాలి అండ్ మిల్లు వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ అనుబంధం)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసరావు జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం నగరంలో రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగిస్తూ అన్ని కార్మిక సంఘాలు విడివిడిగా సివిల్ సప్లై కమిషనర్లకు చార్టెడ్ ఆఫ్ డిమాండ్ నోటీసు ఇచ్చారు. నేడు రేపు అంటూ కాలం కాలయాపన చేస్తున్నారే తప్పఆరు నెలలు గడుస్తున్న చర్చల ప్రక్రియ ప్రారంభించ కపోవడం తీవ్రంగా నిరసిస్తున్నాము. నిన్నగాక మొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది కార్మికులకు లబ్ధి చేకూర్చున్నామని కనీస వేతనాల జీవోలను విడుదల చేశారని ఆ జీవోలు ఎంత లబ్ధి చేకూరుస్తున్నావు పక్కన పెడితే కార్మికుల శ్రేయస్సు కొరకు మా ప్రభుత్వం ఉందని గొప్పలు చెబుతున్నారు తప్ప కార్మికులకు న్యాయం చేకూర్చే విధంగా లేదని వారు ఆరోపించారు. సివిల్ సప్లై లో పనిచేస్తున్న హమాలీలు కార్మికులకు ఆరు నెలలు గడుస్తున్న ఎందుకు వేతన ఒప్పందాన్ని ప్రారంభించలేదో అధికారులు సమాధానం చెప్పాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు. సివిల్ సప్లై అధికారులను అనేకసార్లు కలిసి వేతన ఒప్పంద ప్రక్రియ ప్రారంభించమని కోరుతూ వచ్చాము. అధికారుల నుండి ఏమాత్రం స్పందన లేకపోవడం వలన విసిగి వేసారి నా కార్మికులు తీవ్రంగా ఉన్నారు. సివిల్ సప్లై హమాలీ మరియు కార్మికుల వేతనాల చర్చల ప్రక్రియ సత్వరమే ప్రారంభించాలని 2026 జూన్ ఆరో తారీఖున సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునివ్వడం జరిగిందని రాష్ట్రంలో ఉండే వివిధ పాయింట్లు పనిచేస్తున్న కార్మికులు ఈ ధర్నా లో పాల్గొనివిజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. **డిమాండ్స్ !** 1) సివిల్ సప్లై హమాలి రేట్లను తక్షణమే పెంచే ప్రక్రియ ప్రారంభించాలి. 2) కనీస వేతనాలు దినసరి కార్మికులకు వర్తింప చేయాలి. 3) హెల్త్ బెనిఫిట్ కార్డ్స్ ఇవ్వాలి. 4) ఎంప్లాయిమెంట్ ప్రావిడెంట్ ఫండ్ సక్రమంగా అమలు చేయాలి. 5) పిఎఫ్ ఉంది రిటైర్మెంట్ పొందిన వారికి, మరణించిన వారసులకు పెన్షన్ అందేటట్లు చర్యలు తీసుకోవాలి. తదితర డిమాండ్స్‌తో జరప తలప పెట్టిన ధర్నాను విజయవంతం చేయడం కోసం కార్మిక వర్గం ఆలోచించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ప్రగతిశీల హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ కంటి రమేష్, జిల్లా నాయకులు గాదె బాబు, నరేష్, బెల్లంకొండ చిన్నబాబు, ఐలబోయిన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ..

## • డీఈఓ ఉత్తర్వులు జారీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రంగారెడ్డి జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల ఫీజులు భారంగా మారుతున్న నేపథ్యంలో, వారికి ఉచిత విద్య లేదా ప్రత్యేక రాయితీలు కల్పించాలని టీయూడబ్ల్యూజే-ఐజేయూ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. ఈ విషయంపై జిల్లా అధ్యక్షుడు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేసింది. జర్నలిస్టుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించి, వారి పిల్లల విద్యాభారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. యూనియన్ వినతిపై సానుకూలంగా స్పందించిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఉత్తర్వుల ప్రతులను జిల్లా అధ్యక్షుడు ఎండి సలీమ్ పాషాకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకు టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండి సలీమ్ పాషా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జర్నలిస్టుల కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. అలాగే ఈ ఆదేశాలు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా, సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు (ఎంఈఓలు) కూడా సూచనలు జారీ చేసి ఉత్తర్వుల ప్రతులను పంపిస్తామని జిల్లా విద్యాధికారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు మారాటి రవి, జర్నలిస్టు నాయకులు కరుణాకర్, భాస్కర్, భార్గవ్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల పిల్లల విద్యకు ఊరట కలిగించే ఈ నిర్ణయంపై జిల్లాలోని జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ యువత బాధ్యత




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మేర యువ భారత్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ సహకారంతో ఖమ్మం నగరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్ మరియు జిల్లా అధ్యక్షులు గోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ యువత బాధ్యత అని చెట్లు పెంచడం వల్ల మానవాళికి ఆక్సిజన్ అందడంతో పాటు వర్షాలు కురవడం, కాలుష్య నిర్మూలన చెట్లు పెంపకం ద్వారానే సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు సంవత్సరానికి కనీసం రెండు మొక్కలు నాటినట్లయితే రాబోయే రోజుల్లో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా రేడియేషన్ మరియు గ్లోబల్ వార్మింగ్ ను పూర్తిగా తగ్గించవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా యువతతో పది మొక్కలను నాటించి అవగాహన ర్యాలీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం యువత వేసిన పోస్టర్ పెయింటింగ్ లను పరిశీలించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రచ్చ సతీష్, మోహన్, సారిక, ఉపేందర్, కల్లేపు అఖిల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వేదిక ఏర్పాట్లను పరిశీలించిన జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో భవిష్యత్ నగరం, వలయాకార రహదారులు, రహదారి విస్తరణ పనుల్లో భాగంగా జూన్ 8న మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన వేదిక, ఏర్పాట్లను శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను కేవలం అభివృద్ధి చెందిన రాష్ట్రంగా కాకుండా ప్రపంచం వైపు చూసే రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే దూరదృష్టితో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరేలా చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, విద్య, వైద్యం, పారిశ్రామికీకరణ, సాగునీరు, సంక్షేమ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి అభివృద్ధి పనుల కోసం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గౌరవ మంత్రుల సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చైర్మన్ చెల్లా నర్సింహారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి శాసనసభ్యుడు అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, కుత్బులాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తా..

## మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి



**బ్యూరో చీఫ్(ది క్రైమ్ న్యూస్ ):** మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్థికంగా రాజకీయంగా ఎదిగేలా వారికి పూర్తిస్థాయిలో అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ ను కరీంనగర్ పట్టణ గ్రేటర్ విద్యానగర్ మున్నూరు కాపు సంఘం నాయకులు కరీంనగర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చక్రవర్తి పటేల్ ను శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం తమ సమస్యలపై సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రేటర్ విద్యానగర్ మున్నూరు కాపు సంఘం 5 డివిజన్లో విస్తరించి ఉందని సంఘం భవన స్థలం సేకరణకు చొరవ చూపాలని మున్నూరు కాపుల సంక్షేమానికి అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేసిన మున్నూరుకాపు కులానికి ఆత్మబాంధవుగా ఉన్న బొమ్మ వెంకన్న కాంస్య విగ్రహం విద్యానగర్ లో ఏర్పాటుకు తమవంతు సహకారం అందించాలని కోరారు. సందర్భంగా చైర్మన్ బొమ్మ శ్రీరామ్ మాట్లాడుతూ మీ సమస్యలపై జిల్లా యంత్రాంగంతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్నూరు కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మున్నూరు కాపుల అభ్యున్నతికి ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను ప్రతి ఇంటికి చేరవేసేలా తన కార్యాచరణ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనాల నరసయ్య, ఉప్పు తిరుపతి ,బట్టు సుధాకర్, ఐల రామ్మోహన్, బోనాల శ్రీను, ఉప్పు శ్రీను, గూడ వినయ్, ర్యాకం సుధాకర్, తోట సునీల్, పోరెడ్డి నరేందర్ రెడ్డి, బండారి వెంకట్ ప్రసాద్, జవ్వాజి శ్యాంప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ పర్యావరణ దినోత్సవం

## మొక్కలు నాటిన డాక్టర్లు, వాకర్స్






**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పెవిలియన్ గ్రౌండ్ లో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్లు, పేర్ల ఆదిశంకర్ రావు, శోభాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు, అదేవిధంగా పెవిలియన్ గ్రౌండ్ లో చెత్తను తొలగించేందుకు చిన్న ట్రాలీని అందజేశారు. వాటిని సంరక్షించాలని పెవిలియన్ గ్రౌండ్ నడక సాదకులకు పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే చర్యలు అవసరమన్నారు. ప్రతి ఇంటా ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు రామనాథం, ప్రధాన కార్యదర్శి రాకం శ్యామ్ బాబు, సభ్యులు విజయ్, వెంకట్, కృష్ణారావు, దామోదర్ రెడ్డి, ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ప్రధాని కార్యదర్శి మంద వెంకటేశ్వర్లు, రమ శేఖర్ డాక్టర్ రాంబాబు, చంద్రశేఖర్, నరసింహారావు, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 8న పెద్దపల్లికి రానున్న మాజీ మంత్రి హరీష్ రావు

## నియోజకవర్గ స్థాయి సమావేశానికి తరలిరావాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా,భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజా సమస్యలపై పోరాట వ్యూహాలను ఖరారు చేసేందుకు ఈ నెల 08న నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి మెయిన్ రోడ్డులో గల తిరుమల గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్,మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు హాజరై,పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడానికి,ప్రజా పక్షాన నిలబడి పోరాడటానికి ఈ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు,నియోజకవర్గంలోని ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు,అన్ని మండలాల మరియు పట్టణాల కార్యవర్గ సభ్యులు,ముఖ్య నాయకులు,క్రియాశీలక కార్యకర్తలు,పార్టీ అభిమానులు,ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి, భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- జి.యంలు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్
- అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్య నారాయణ







**రామగిరి, జూన్ 05(ది క్రైమ్ న్యూస్):** పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యతని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్య నారాయణ అన్నారు. జూన్-5, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని జి.యం. కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ముందుగా పర్యావరణ విభాగాధిపతి పి.రాజారెడ్డి ఉద్యోగులందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉద్యోగులందరిలో అవగాహన కల్పించడం కోసం సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ సందేశంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించి ఉద్యోగులందరికీ అందచేయడమే కాకుండా చదివి వినిపించారు. తదుపరి సింగరేణి కోల్ నీర్ ప్లాంట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్య నారాయణ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం ఒక ప్రధాన సమస్యపై ప్రపంచ దేశాలన్నీ దృష్టి సారించడం జరుగుతుందని, ఈ సంవత్సరం "ప్రకృతి నుండి ప్రేరణతో... వాతావరణం కోసం...మన భవిష్యత్తు కోసం" అనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు. పర్యావరణ సంరక్షణలో వ్యక్తి గత చర్యలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సామూహికంగా చెట్ల పెంపకం, ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వ్యర్థాలు పూర్తిగా తగ్గించడం, బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ వస్తువులు, ప్రత్యామ్నాయ పర్యావరణ అనుకూల ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్లాస్టిక్ సంచులకు బదులుగా కాటన్ లేదా జనపనార సంచులను వాడటం, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా కాగితపు వస్తువులను వాడటం, ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం తగ్గించడం లాంటి చర్యలు చేపట్టాలని అన్నారు. మనం జరుపుకుంటున్నటువంటి ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో సుస్థిరమైన పర్యావరణ విధానాలకు మద్దతు ఇవ్వడానికి, పర్యావరణ సారధ్య సంస్కృతిని పెంపొందించడానికి కట్టుబడి ఉండాలని, మనమంతా కలిసి పర్యావరణ హితానికి కృషి చేస్తేనే రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన భవిష్యత్తుని అందించగల్గుతామని ముఖ్యంగా మహిళలు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల కోసం ముందు ఉండాలన్నారు. తదుపరి కార్యాలయ ప్రాంగణంలో అధికారులు, ఉద్యోగులు మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, విభాగాధిపతులు బి.వి.సత్య నారాయణ, బి.టి.మురళీ కృష్ణ, రాజేంద్ర కుమార్, ఐలయ్య, రవి చరణ్, రాజేశ్వరి, సునీల్ ప్రసాద్, మేఘన, ఓసి-వన్ పర్యావరణ అధికారి కిషన్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ ఉద్యోగాల్లో తేజస్ అకాడమీ ఘనవిజయం

- 160 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



**కరీంనగర్ టౌన్, జూన్ 5(ది క్రైమ్ న్యూస్):** ఇటీవల విడుదలైన డిఫెన్స్ ఫలితాలలో తేజస్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, రికార్డు స్థాయిలో 160 ఉద్యోగాలు సాధించారని అకాడమీ చైర్మన్ సి.హెచ్. సతీష్ రావు తెలిపారు. జూన్ 2025లో జరిగిన హన్మకొండ ఆర్మీ ఓపెన్ ర్యాలీలో పాల్గొన్న వీరిలో, 156 మంది ఇండియన్ ఆర్మీకి, ముగ్గురు (3) ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు అగ్నివీరులుగా ఎంపికయ్యారు. ఇండియన్ ఆర్మీ (మొత్తం: 156): జి.డి - 131, ట్రేడ్స్‌మెన్ - 12, టెక్నికల్ - 13, క్లర్క్ - 01. (ఫలితాలు: 31 మే 2026)ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (మొత్తం: 03): నాన్ టెక్నికల్ - 03. (ఫలితాలు: 01 జూన్ 2026)"తేజస్ శౌర్య 2026" వేడుక:ఈ ఘన విజయం సందర్భంగా అకాడమీలో "తేజస్ శౌర్య 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఘనంగా అభినందించి, వారికి జ్ఞాపికలను అందజేశారు. ఎంపికైన అభ్యర్థులందరూ జూన్ 8 నుంచి వారి వారి ట్రైనింగ్ సెంటర్లలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. వీరందరూ దేశ సేవలో ఉన్నత స్థానాలకు చేరుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చైర్మన్ ఆకాంక్షించారు. అకడమిక్స్‌లోనూ అగ్రస్థానం తేజస్ అకాడమీ కేవలం డిఫెన్స్ రంగంలోనే కాకుండా ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ రాష్ట్ర స్థాయి మార్కులతో దూసుకుపోతోంది. ఎంపీసీ : 1స్ట్ ఇయర్ (470 కి) 468, 467, 466 । 2అండ్ ఇయర్ (1000 కి) 993, 992బైపీసీ : 1స్ట్ ఇయర్ (440 కి) 436, 426 । 2అండ్ ఇయర్ (1000 కి) 969, 954, సి ఇ సి : 1స్ట్ ఇయర్ (500 కి) 490, 483 । 2అండ్ ఇయర్ (1000 కి) 973, 972ప్రతి నోటిఫికేషన్‌లోనూ తెలంగాణలోనే అత్యధిక ఉద్యోగాలు సాధిస్తూ, ఇప్పటివరకు 2000 మందికి పైగా విద్యార్థులను ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దామని ఈ సందర్భంగా సతీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి: డబ్బికార్ మల్లేష్



**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, వాటిని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ సంస్థల దోపిడీ పెరిగిపోయిందని విమర్శించారు. అధిక ఫీజులు, డొనేషన్ల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్య, వైద్యం, నిరుద్యోగం, ఇళ్ల స్థలాలు, పేదలకు 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా అందించడం వంటి ప్రజా సమస్యలపై ఈ నెల నుంచి ఆగస్టు వరకు డివిజన్ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించాలని నాయకత్వానికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. విద్య, వైద్య రంగాలకు కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో అమలు చేయడంలో విఫలమవుతోందని విమర్శించారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురాకపోవడం ఎందుకని ప్రశ్నించారు. రాబోయే మూడు నెలల్లో విద్య, వైద్య రంగాల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, రాగిరెడ్డి, మంగారెడ్డి, పరశు రాములు, వినోద్ నాయక్, రొండు శీను, పట్టణ కార్యదర్శి మల్లు గౌతమ్ రెడ్డి, నాయకులు రామ్మూర్తి, దయానంద్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు సభలు

## హాలియాలో 6, 7, 8 వార్డుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నేడు



**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 కార్యాచరణ -- 5వ దశలో భాగంగా హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో 6, 7, 8 వార్డుల వార్డు సభలు జూన్ 6, శనివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ బహదూర్ షా నివాసం వద్ద నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ వార్డు సభల్లో ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు మరియు వీధి దీపాలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పంటల మార్పిడి, రోడ్డు భద్రత వంటి అంశాలపై చర్చించనున్నారు. అలాగే చేయూత పథకం కింద వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికుల పెన్షన్ దరఖాస్తులు మరియు ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను వార్డు సభ అనంతరం స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశాలకు సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించనున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పురపాలక సంఘం కమిషనర్ కోరారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: జూలకంటి రంగారెడ్డి



**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని కళాలవాడలో నిన్న అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనలో గృహం పూర్తిగా దగ్ధమై, ముగ్గురు మృతి చెందిన విషాద సంఘటనపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి, అగ్నిప్రమాదం జరిగిన తీరును పోలీసుల ద్వారా వివరంగా తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ విషాద ఘటనతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాగిరెడ్డి, మంగారెడ్డి, మల్లు గౌతంరెడ్డి, సీపీఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక బృందాలు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు..

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసులు నమోదు.
- 15 మంది వ్యక్తులకు గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు..
- జిల్లాలో గంజాయి వినియోగంపై కఠిన నిఘా..

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్05(ది క్రైమ్ న్యూస్):-** మహబూబాబాద్ జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతి రెడ్డి రూరల్ సీఐ అంజలి 7 మంది ఎస్ఐలు 40 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు, చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, పార్కులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగంపై ఆరా తీశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 25 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అనుమానాస్పద 15 మంది వ్యక్తులకు గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో రిజల్ట్ నెగెటివ్ వచ్చినది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, గంజాయి విక్రయదారులు, సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. గంజాయి యువత భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక దురాచారమని, జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు, అలాగే గంజాయి అలవాటుతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ 8712656999కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# మల్లంపేట్ జంక్షన్‌లో ట్రాఫిక్‌కు చెక్...



**కుత్బుల్లాపూర్, (ది క్రైమ్ న్యూస్):** బాచుపల్లి నుంచి ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ -4 వరకు అనుసంధాన మార్గంగా ఉన్న మల్లంపేట్ జంక్షన్ వద్ద రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. జంక్షన్‌ను సిమెంట్ బ్లాకులతో మూసివేసి, కొంత దూరంలో యూ-టర్న్ ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలు మరింత సాఫీగా సాగుతూ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. రాత్రి సమయంలో సిమెంట్ బ్లాకులు వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా వాటిపై రేడియం స్టిక్కర్లు కూడా అమర్చినట్లు వెల్లడించారు. ఈ చర్యలతో ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ నిర్వహణ మరింత మెరుగుపడుతుందని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

# ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయడంతో పాటు పర్యావరణ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పర్యావరణ హిత సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో రూపొందించిన ప్రత్యేక జూట్ బ్యాగులను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రసంగించిన వంగ వెంకట్ మాట్లాడుతూ, ప్రకృతి మరియు పర్యావరణ పరిరక్షణ నేటి సమాజం ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన బాధ్యతలలో ఒకటని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, నీటి వనరుల క్షీణత వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, నీటి వనరులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి సంస్థ చేపడుతున్న హరిత కార్యక్రమాలు, విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం, కాలుష్య నియంత్రణ చర్యలు మరియు పర్యావరణహిత కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



**రామగిరి, జూన్ 05(ది క్రైమ్ న్యూస్:-** రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన పొన్నం సారయ్య గౌడ్(55) సంవత్సరాలు అనే కౌలు రైతు శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. మృతుడు సారయ్య తనకున్న కొద్ది పొలంతో పాటు ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం సాగు చేసుకుంటూ ఉండేవాడు. ఆశించిన పంట దిగుబడి రాకపోగా తెచ్చిన అప్పులు పెరిగిపోవడంతో బాధపడుతూ ఉండేవాడు, ఇంట్లో తన భార్య ఉపాధి పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య ముగ్గురు కుమారులు కాగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధతో మృతి చెందిన కౌలు రైతు సారయ్య గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస్, గ్రామస్తులు కోరుతున్నారు.

# గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకే ప్రభుత్వం పెద్దపీట

## ● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి







**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** ఇసుక బావిగూడెంలో గ్రామ సమైక్య నూతన భవనం ఘన ప్రారంభం మాడ్గులపల్లి మండలంలోని ఇసుకబావిగూడెం గ్రామంలో మహిళా సంఘాల బలోపేతం కోసం అత్యాధునిక వసతులతో నిర్మించిన గ్రామ సమైక్య (వూ) నూతన కార్యాలయ భవనాన్ని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించి భవనాన్ని మహిళలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే గ్రామీణ సమాజం మరింత బలపడుతుందని అన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామ సమైక్య భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, వ్యాపార ప్రణాళికల రూపకల్పన వంటి కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. నూతనంగా నిర్మించిన ఈ భవనంలో మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, రికార్డుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామ సమైక్య సభ్యులు ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకుని సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సమైక్య ప్రతినిధులు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వూాం), పొదుపు సంఘాల మహిళలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి

## ● ఎంపీఓ సమ్మిరెడ్డి సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు




**రామగిరి, జూన్ 05(ది క్రైమ్ న్యూస్):-** పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని రామగిరి ఎంపీఓ మూల.సమ్మిరెడ్డి, రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం సందర్భంగా రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో "నాటుదాం ఒక చెట్టు - అమ్మ పేరు మీద" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఒక చిన్న మంచి పని కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుందన్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఎస్.డబ్ల్యూ.ఎం రూల్స్ (2026) పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించబడింది. ముఖ్యంగా బ్లూ, గ్రీన్, రెడ్, బ్లాక్ రంగుల నాలుగు రకాల డస్ట్ బిన్స్ వినియోగం, తడి- పొడి చెత్త వేర్వేరుగా నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై వివరించబడింది. అలాగే " జలసంచయ్ జన్ భగీరథి" కార్యక్రమం కింద నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, వాటర్ కన్జర్వేషన్ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అలాగే "స్వచ్ఛ గావ్ సురక్షిత్ జల్వాయు" క్యాంపెయిన్ కింద నీటి సంరక్షణకు ప్రతి గ్రామస్థుడు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్, వార్డు సభ్యులు జక్కుల పద్మాచందన్, కలవేన రవి, ఖండే లక్ష్మి గట్టయ్య కండి సాహితీ పోశం, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, బత్తుల.రాజమణి రమేష్, ఫీల్డ్ అస్సిటెంట్ సందేవెన జ్యోతి కుమార్, అంగన్వాడి టీచర్ తొగరు పాపమ్మ, ఆశా వర్కర్లు అంగూరి విజయలక్ష్మి, మేడ స్వరూప,కారోబర్ కొండపర్తి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్క మొక్క.. ఎన్నో ప్రాణాలకు ఆధారం": పర్యావరణ దినోత్సవంలో సందేశం






**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక అమరవీరుల స్థూపం ప్రాంగణంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ--బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష--నవీన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గౌతమ్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను చాటిచెప్పే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, పురపాలక సంఘ అధికారులు, పర్యావరణ ప్రేమికులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కల నాటకంలో పాల్గొన్నారు. ప్రకృతి సంరక్షణే మానవ మనుగడకు ఆధారం అని పేర్కొంటూ, "మొక్కే కదా అని తీసేయకండి... అది మనకు ప్రాణవాయువును అందించే వరం" అని సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పచ్చని భవిష్యత్తు కోసం ప్రతి ఇంటా ఒక మొక్క - ప్రతి మనసులో పర్యావరణ చైతన్యం!

# పచ్చదనమే భవిష్యత్తుకు భరోసా: చింతల చంద్రారెడ్డి

## హాలియాలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు




**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** పురపాలక సంఘం హాలియా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రాబూ) హాలియాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని చెట్ల పెంపకం అత్యవసరమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. అప్పుడే పర్యావరణ పరిరక్షణ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజహార్ మొయినుద్దీన్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, కోఆప్షన్ సభ్యుడు ఎండి రషీద్, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి భూములను ఇండస్ట్రియల్ పార్క్‌కు అప్పగిస్తున్నాం

## పంటలు ఎవరు వేయవద్దు - గ్రామ సభలో మంథని ఆర్డీవో కాశబోయిన సురేష్




**రామగిరి, జూన్ 05(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి ఖిల్లా కు సంబంధించి మేడి పల్లి శివారు లోని భూములను ఇండస్ట్రియల్ పార్క్ కు అప్పగిస్తున్నామని మంథని ఆర్డీవో కాశబోయిన సురేష్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అధ్యక్షతన గ్రామసభ జరగగా,ఆర్డీవో సురేష్, తాహసిల్దార్ పర్నంది.సుమన్ హాజరయ్యారు. మేడిపల్లి శివారులో 80 శాతం భూమిని తీసుకోవడం జరిగిందని, ఎకరానికి రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. 200 ఎకరాలకు పైగా పట్టా, ప్రభుత్వ భూములు తీసుకుంటున్నామని తెలిపారు. 9 మంది రైతుల భూములు వివాదాస్పదంగా ఉండగా వాటి పరిష్కారం కొరకు గ్రామసభలు ఆర్డీవో సురేష్, తాహసిల్దార్ సుమను రైతులతో మాట్లాడారు. త్వరలో మిగతా భూములలో రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. ఎవరు కూడా బాధపడవద్దని అన్ని భూముల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామాభివృద్ధి కొరకు సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారని మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్షణ దృష్టికి తీసుకువెల్లి, నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతుల రుణమాఫీ, రెండు గుంటల భూమి, పావులా వడ్డీకి 10 లక్షల రుణం, ఇతరత్ర సమస్యలు రైతులు అడగగా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్.ఐ కె.మహేష్, గడ్డం రవిశంకర్, సర్వేయర్ నాగండ్ల రాధిక, జీపీఓ పెర్క. వెంకటేశ్వర్లు,సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం సమస్య పరిష్కారం కోసం లోక్ అదాలత్ స్టీరింగ్ కమిటీ

## లోక్ అదాలత్ సెటిల్మెంట్ సమావేశం నిర్వహణ



**రామగిరి, జూన్ 05(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి రామగుండం-త్రీ ఏరియాలోని ఓసిపి-టు ఉపరితల గని విస్తరణ కోసం అక్కేపల్లి, లద్నాపూర్, రచ్చపల్లి గ్రామాలలో భూసేకరణ కోసం 2015 సంవత్సరము అవార్డు ఇవ్వడం జరిగింది. అట్టి అవార్డులో మెరుగైన పరిహారం రాలేదని రైతులు హైకోర్టుకు వెళ్లడం జరిగింది.హైకోర్టు ఆదేశాల మేరకు మెరుగైన పరిహారం చెల్లింపు విషయమై శుక్రవారం స్థానిక సి ఎన్ సి ఓ ఏ క్లబ్ నందు లోక్ అదాలత్ ద్వారా సమస్య పరిష్కరించడం కోసం సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి అక్కేపల్లి, లద్నాపూర్, రచ్చపల్లి గ్రామాల నుండి సుమారు 200 మంది రైతులు, గ్రామ సర్పంచులు, 9మంది న్యాయవాదులు హాజరై మెరుగైన పరిహారం చెల్లింపు పై చర్చించారు. ఇట్టి కార్యక్రమానికి కమిటీ చైర్మన్, ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ టీ. లక్ష్మీపతి గౌడ్ వ్యవహరించారు.వారు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల ప్రకారం భూనిర్వాసితులకు మెరుగైన పరిహారం సమస్య పరిష్కారం కోసం లోక్అదాలత్ స్టీరింగ్ కమిటీ నిర్వహిస్తున్నామని, భూ నిర్వాసితులు సహృదయంతో ఆలోచించి సమస్యను పరిశీలించుకునే విధంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, ఫైనాన్స్ విభాగం జనరల్ మేనేజర్ పి.శ్రీనివాసులు, ఎస్వోటుజియం యం.రామ్మోహన్, లా విభాగం డీజీఎం శిరీష రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె. రాజశేఖర్, ఫైనాన్స్ డీజీఎం సిజే సురేఖ, ఎస్టేట్స్ అధికారులు తేజావత్ హీర్యా, శ్రీనివాస్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కలల్‌వాడ కాలనీలో ఘోర విషాదం

## గ్యాస్ సిలిండర్ పేలుడుతో అమ్మమ్మ, మనవడు, మనవరాలు సజీవ దహనం







**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలోని కలల్‌వాడ కాలనీలో అర్ధరాత్రి చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు వేగంగా వ్యాపించి, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సజీవ దహనమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం, అర్ధరాత్రి సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. అనంతరం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంటి మొత్తం మంటల్లో చిక్కుకుంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న చంద్రమ్మ (45), ఆమె మనవడు లక్ష్మణ్ (16), మనవరాలు ప్రణీతి (14) బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో మంటల్లో సజీవ దహనమైనట్లు సమాచారం. అర్ధరాత్రి కావడంతో కాలనీవాసులు గాఢ నిద్రలో ఉండటంతో ప్రమాదాన్ని గుర్తించేందుకు కొంత సమయం పట్టింది. భారీ పేలుడు శబ్దం విని స్థానికులు బయటకు వచ్చి సహాయక చర్యలు చేపట్టినా, అప్పటికే మంటలు తీవ్రరూపం దాల్చడంతో బాధితులను రక్షించడం సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో కలల్‌వాడ కాలనీతో పాటు మిర్యాలగూడ పట్టణం మొత్తం విషాదంలో మునిగిపోయింది. "ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సజీవ దహనం" అనే ఈ దుర్ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

# అసత్య ప్రచారంపై విచారణ జరిపించాలని స్వర్ణలత విజ్ఞప్తి

## నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**నల్గొండ ప్రతినిధి, జూన్ 5 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ జి. స్వర్ణలత తనపై కొందరు వ్యక్తులు అనవసర ఆరోపణలు చేస్తూ పత్రికల్లో అసత్య వార్తలు ప్రచురింపజేస్తున్నారని ఆరోపిస్తూ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత సంవత్సరం నుంచి ఆసుపత్రి ఉన్నతాధికారులు తనకు క్లాస్-4 ఉద్యోగుల విధులు, శానిటేషన్ రౌండ్ల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారని తెలిపారు. ఆ బాధ్యతల నిర్వహణలో భాగంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. కొంతమంది ఉద్యోగులు ఒకేసారి నాలుగు వారపు సెలవులు తీసుకుని వరుసగా విధులు నిర్వహించడం, హాజరు కాని రోజులకు సంతకాలు చేసి ఇతర రోజుల్లో విధులు చేస్తామని చెప్పడం వంటి చర్యలను తాను వ్యతిరేకించానని పేర్కొన్నారు. అలాగే విధులకు సమయానికి హాజరుకావడం, వారపు సెలవులను నిబంధనల మేరకు వినియోగించుకోవడం అవసరమని సూచించినట్లు తెలిపారు. శానిటేషన్ విభాగంలో పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అందరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పడమే కొందరి అసంతృప్తికి కారణమైందని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు బయటి వారి సహకారంతో మెమొరాండం తయారు చేసి తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తనపై వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. నిరాధార ఆరోపణల కారణంగా తాను తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షాహిల్ ఖాన్ (నర్సింగ్ సూపరింటెండెంట్), జి. వెంకటరమణ (నర్సింగ్ సూపర్వైజర్), ఎం. నాగరాజు (సూపర్వైజర్), ఏ. స్వర్ణ, రమాదేవి, విజయలక్ష్మి, బి. వెంకటరమణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్

## తిరుమలలో మొక్క నాటి

### శ్రీవారిని దర్శించుకున్న పీయూష్ గోయల్

తిరుమల,జూన్5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనం అద్భుతంగా జరిగిందన్నారు. ప్రతి ఏటా జూన్ మాసంలో పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు తన తల్లి పేరిట తిరుమలలో మొక్క నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు నేడు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలు కూడా తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలన్నారు. తిరుమలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అద్భుతంగా ఉందని కేంద్ర మంత్రి కొనియాడారు. దర్శన గణంకాలతో పాటు తిరుమలలో టీటీడీ భక్తులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ఇక్కడి నుంచే పర్యవేక్షించడం అద్భుతమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో అత్యాధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను100 రోజుల్లోనే టీటీడీ ఏర్పాటు చేయడం హర్షణీయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈరోజు(శుక్రవారం) ఉదయం కేంద్ర మంత్రి తిరుమల శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### తల్లి పేరుతో ఒక్కొక్కరు ఓ మొక్క నాటాలి

### మూలపాడు ఆర్క్‌లో మొక్క నాటిన పవన్

అమరావతి,జూన్5 : ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మనం నాటే ప్రతి మొక్క మహావృక్షం కావాలని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మూలపాడులోని బటర్‌ఫ్లై పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లి అంజనా దేవి పేరిట తెల్లపొణికి మొక్కను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాటడం ద్వారా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వర్షా కాలంలో రాష్ట్రమంతటా సీడ్ బాల్స్ చల్లడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు చెప్పారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' థీమ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట మొక్క నాటాల్సి ఉందన్నారు. ప్రతి చెట్టు వాతావరణ మార్పులపై రక్షణ కవచంగా నిలవాలని పేర్కొన్నారు. చెట్లు నాటడం ద్వారా రాష్ట్రాన్ని పచ్చగా మార్చి.. వాతావరణ మార్పుల నుంచి భూమిని కాపాడుకుందామని మానవాళికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## ఎపిలో పలువురు నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

అమరావతి,జూన్5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పలువురు నాన్ క్యాడర్ ఎస్పీ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఓ. దిలీప్ కిరణ్‌ను ఇంటెలిజెన్స్ విభాగానికి నియమించారు. టీ.టి. ప్రభాకర్‌బాబును సీఐడీ మహిళా రక్షణ సెల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. డాక్టర్ వి.బి.ఆర్ రాజ్ కమల్‌ను కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో నియమించారు. అదేవిధంగా కె. శ్రావణిని మెరైన్ విభాగానికి నియమించగా, డి. శ్రీ భవాని హర్షను పీఆర్ అండ్ ఆర్డీ శాఖ సీవోవోగా కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. కె. శ్రీలక్ష్మికి సీఐడీ యూఆర్‌సీసీ విభాగంలో కొత్త బాధ్యతలు అప్పగించారు. జే. రమేష్ రెడ్డిని సైబర్ క్రైమ్ విభాగానికి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ పోస్టును మార్పు చేసి సైబర్ క్రైమ్ విభాగానికి కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## మెగా డిఎస్సీపై అసత్య ప్రచారాలు

### నిబంధనల మేరకే పరీక్షల నిర్వహణ

### మరోమారు అధికారుల వివరణ

అమరావతి,జూన్5 : ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ–2025 రిక్రూట్మెంట్‌పై తప్పుడు ప్రచారాలు జరుగుతుండటంపై సంబంధిత అధికారులు స్పందించారు. ఉద్యోగ నియామకాలపై అవాస్తవాలను తప్పుబడుతూ జీఏడీ, విద్యాశాఖ, క్రీడాశాఖల ఉన్నతాధికారులు మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలకు చెక్ పెడుతూ కీలక విషయాలను వెల్లడించారు. హారిజాంటల్ రిజర్వేషన్లకు సంబంధించి గత ప్రభుత్వం జీవో జారీ చేసిందని జీఏడీ–సర్వీసెస్ స్పెషల్ సీఎస్ ఎస్.ఎస్.రావత్ తెలిపారు. ఆ జీవో ఆధారంగానే డీఎస్సీ–2025 రిక్రూట్మెంట్ ప్రక్రియ చేపట్టారని ఆయన వెల్లడించారు. కొత్త విధానంలో తొలిసారి భారీ నియామకాలు చేపట్టడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రావత్ మీడియాతో మాట్లాడుతూ.. 'గత కొన్ని రోజులుగా హారిజాంటల్ రిజర్వేషన్ల విషయంలో గందరగోళం కలిగించే అంశాలు ప్రచారం చేస్తున్నారు. ర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల అమలు విధానం వేర్వేరుగా ఉంటుంది. హారిజాంటల్ రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలు రూపొందించి 2023 ఆగస్టు 2న జీవో నంబర్ 77 జారీ చేశారు. ఈ కొత్త పద్ధతి ప్రకారం హారిజాంటల్ రిజర్వేషన్లకు ఫిక్స్‌డ్ రోస్టర్ పాయింట్లు ఉండవు. మెగా డీఎస్సీ రిక్రూట్మెంట్ విధానాన్ని ఈ నిబంధనల ప్రకారమే రూపొందించారు. దీంతో అభ్యర్థులు గందరగోళానికి గురై ఉండొచ్చు. హారిజాంటల్ రిజర్వేషన్లపై కొత్త నిబంధనలు అమలు చేస్తూ ఇంత పెద్దఎత్తున రిక్రూట్మెంట్ చేపట్టడం ఇదే తొలిసారని తెలిపారు.

## భూమి కొలతల కోసం లంచం డిమాండ్

కరీంనగర్,జూన్5 : భూమి కొలతల కోసం లంచం తీసుకున్న మండల సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విడతల వారిగా బాధితుడు నుంచి రూ. 25 వేలు తీసుకున్న మండల సర్వేయర్ ఎక్కలదేవి కుమార స్వామితో పాటు, మరో ఇద్దరు ప్రైవేట్ సర్వేయర్లు తీగల రాజేశ్, వంగ విహిత్ రెడ్డిని పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మన్‌గుర్తి గ్రామానికి చెందిన బాధితుడు తన భూమికి సంబంధించిన సర్వే చేయాలని సంప్రదించగా గత మే నెల నుంచి మూడు విడతలుగా మండల సర్వేయర్ లంచం తీసుకున్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

### ప్రజాప్రతినిధులతో కలసి రామ్మోహన్ సైకిల్ ర్యాలీ



శ్రీకాకుళం,జూన్5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైనది పర్యావరణ మన్నారు. పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ... పర్యావరణ ప్రభావం మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం మీద ఉంటుందన్నారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాని మోదీ గత 12 సంవత్సరాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేస్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ప్రధానిని ఆదర్శంగా తీసుకొని దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కొనసాగుతోందన్నారు. మోదీ చేపట్టిన స్వచ్ఛభారత్‌ను ఆదర్శంగా తీసుకుని సీఎం చంద్రబాబు స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం చేపట్టారని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని పిల్లలకు కూడా అలవాటు చేయాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈరోజు 15 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. కాలుష్య నివారణ, ఇంధన పొదుపు చర్యల్లో భాగంగానే సీఎం చంద్రబాబు సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారని రామ్మోహన్ తెలిపారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఇటీవల 24 లక్షల మంది హైబ్రిడ్ విధానంలో పాల్గొని మహానాడు విజయవంతం చేయడం ఇంధన పొదుపు చర్యలకు ఒక అద్భుతమైన మోడల్ అని చెప్పుకొచ్చారు. ఎ÷–లాస్టిక్ రహిత ఆంధ్రాగా మారుద్దామన్నారు. ప్లాస్టిక్ మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 59 పాఠశాలలను నెట్ జీరో స్కూల్స్‌గా తీర్చిదిద్ది.. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించామన్నారు. శ్రీకాకుళం పట్టణంలో రూ.కోటి వ్యయంతో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ బోర్డును కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైకిల్ తొక్కడమనేది ఇంధన పొదుపు మాత్రమే కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే సైకిల్ తొక్కాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## భూకబ్జా కుట్రదారుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

### తమిళనాడు కాంచీపురంలో అరెస్ట్...హైదరాబాద్‌కు తరలింపు

### వైకాపా నేతపై పలు సెక్షన్ల కింద కేసులు

హైదరాబాద్ : నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మనాయుడును అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగంతోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్

శ్రీకాళహస్తి,జూన్5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం గంగా సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలంటే చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, వన్యప్రాణులు మన పర్యావరణ వ్యవస్థలో కీలక భాగాలని, వాటి సంరక్షణకు చెట్లు అత్యంత అవసరమని పేర్కొన్నారు. చెట్లు భూగర్భ జలాల పెరుగుదలకు, భూసార పరిరక్షణకు, వర్షపాతం ఏర్పడటానికి దోహదపడతాయని చెప్పారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడంలో చెట్లు ముఖ్యపాత్ర పోషిస్తాయని, మేఘాలు నిలిచి వర్షాలు కురిసే అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయని వివరించారు.చెట్లు కేవలం నీడను మాత్రమే కాకుండా పండ్లు, పూలు, ఔషధ గుణాలు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవడం మాత్రమే కాకుండా ఆ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్న ఆయన, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు కూడా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాషకు విశిష్ట స్థానం ఉన్నప్పటికీ ఆధునిక కాలంలో మాతృభాష వినియోగం తగ్గుతున్నందుకు ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు వల్ల తెలుగు ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా వెలుగొందిందని పేర్కొన్నారు. తెలుగు ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశ, విదేశాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకోవాలని అన్నారు. ప్రాంతీయ అభిమానం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం, సమాజం, ప్రజలు అభివృద్ధి చెందుతారని తెలిపారు. కాలంలో చాలామంది తెలుగు చదవడం, మాట్లాడడంపై నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు భాషకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కర్ణాటక రాష్ట్రంలో తెలుగు భాషకు లభిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రస్తావిస్తూ, తెలుగు నైతిక విలువలు, సంస్కృతిని పరిరక్షించుకోవాలని అన్నారు. తెలుగు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతినిధులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, భక్తులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు తెలుగు భాషాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి వర్గం ముందుకు రావాలని వక్తలు కోరారు.

## విభజనను వక్రీకరించిన పవన్ క్షమాపణలు చెప్పాలి

### సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి

వేములవాడ,జూన్5 : తెలంగాణ రాష్ట్ర విభజన తీరును వక్రీకరిస్తూ మాట్లాడిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గా÷–డ్గ÷న్ లో శుక్రవారం ప్రారంభించగా ఆయన హాజరై మాట్లాడారు. 12 సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర విభజనను మరోసారి వక్రీకరించి మాట్లాడడం సరికాదని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జాగిరే తెలంగాణ రాష్ట్రమని పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. ఆవేశానికి కేరాఫ్ గా నిలిచిన పవన్ కళ్యాణ్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు లాంటి మేధావుల పై ఆంధ్రప్రదేశ్ లో కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఎన్డీఏ కూటమి కూడా తెలంగాణలో అడుగుపెట్టేందుకు చూస్తుందని ఇందులో భాగంగానే పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు అర్థం చేసుకోవచ్చు అని కూడా అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బేశరత్తుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ పాలనలో సామాజిక న్యాయం పూర్తిగా కొరబడిందని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భంలో ఎట్లా గెలవాలనే దానిపైన దృష్టి ఉంది కానీ రాజ్యాంగంలోని ప్రజలకు కావాల్సిన కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం విధానంలో ప్రభుత్వం పనిచేయడం లేదని విమర్శించారు. దేశంలోని సంపద నలుగురు దగ్గరే మూలుగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి జిల్లాల సిపిఐ జిల్లా కార్యదర్శిలు సుదర్శన్, శ్రీనివాస్, సదానందం, విశ్వనాథం, రాష్ట్ర నాయకులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, శంకర్, నాయకులు వేణు, రాములు తదితరులు ఉన్నారు.

## తిరుమలలో ఎఐ ఆధారిత సేవలు భేష్

### టిటిడిని అభినందించిన మంత్రి పీయూష్ గోయల్

తిరుమల,జూన్5 : తిరుమలలో భక్తుల సౌకర్యార్థం కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, తితిదే ఈవో ఎం.రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపా÷–టం÷–మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేవలం 100 రోజుల్లోపే ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన తితిదే అధికారులను అభినందించారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలలో తన తల్లి పేరిట మొక్క నాటారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీ కృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం అధికారులు పాల్గొన్నారు.

## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్

అమరావతి,జూన్5 : జనసేన రాజ్యసభ అభ్యర్థిగా పారిశ్రామిక వేత్త లింగమనేని రమేశ్ పేరు ఖరారైంది. రాజ్యసభ అభ్యర్థిత్వంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు జనసేన ప్రకటించింది. ఈ మేరకు పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ వెల్లడించారు. లింగమనేని రమేశ్‌కు 2015 నుంచి జనసేనతో అనుబంధం ఉంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ ఆలోచనలకు ఆయన ఆకర్షితులయ్యారు. శనివారం మధ్యాహ్నం రమేశ్ నామినేషన్ వేస్తారని హరిప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో మూడు తెదేపా, ఒకటి జనసేన తీసుకోవాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. బిజెపికి కూడా కేటాయించాలన్న విషయంలో టిడిపి ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు.

## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో పొంగులేటి

హైదరాబాద్,జూన్5 : కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

ది క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక





## జూలైలో విడుదల కానున్న ది ఇండియా స్టోరీ

భారతదేశంలో జరిగిన కొన్ని నమ్మలేని సంచలన నిజాల ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ అండ్ హార్డ్ హిట్టింగ్ మూవీ 'ది ఇండియా స్టోరీ'. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలో నటిస్తున్నాడు. సాగర్ బీ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రియులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక టీజర్ చూస్తుంటే.. సమాజంలో దాగి ఉన్న అత్యంత దిగ్భ్రాం÷–రతికరమైన నిజాలను, తెరవెనుక జరిగిన పరిణామాలను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నామని చిత్ర యూనిట్ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక విలక్షణమైన కథాంశంతో, ప్రేక్షకులను ఆలోచింపజేసే సస్పెన్స్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.


## పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

### సరైన ప్రాధాన్యం లేదంటూ సోషల మీడియా పోస్ట్

### జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం

నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ.135 కోట్లు వసూలు చేసింది.






## పెద్ది బాక్సాఫ్ కలెక్షన్ల సునామి

### తొలిరోజే రూ.135.36 కోట్లు వసూలు

### బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల

ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.



## దూత వెబ్ సీరిస్‌కు నిర్మాతగా నాగచైతన్య

'దూత' వెబ్‌సిరీస్‌తో తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ఇప్పుడు ఈ హిట్ సిరీస్‌కు సీక్వెల్ సిద్ధమవుతోంది. శుక్రవారం పూజా కార్యక్రమాలు జరగ్గా.. నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సీక్వెల్‌కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. 'దూత సెకండ్ చాప్టర్‌లో నిర్మాతగా నా తొలి అడుగు' అంటూ నాగచైతన్య ఫొటోలు పంచుకున్నారు. మరోసారి మ్యాజిక్ చూడడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'దూత'.. 2023 డిసెంబరు 1న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'ల విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఈ హారర్ మిస్టరీ థ్రిల్లర్‌లో జర్నలిస్టు సాగర్ వర్మ అవధూరిగా నాగచైతన్య ఆకట్టుకున్నారు.






## జననాగన్ మూవీ రిలీజ్ వ్యవహారం

### థియేట్రికల్ ఒప్పందాలు రద్దు చేసుకున్నట్లు వార్తలు

ఈ ఏడాది ప్రారంభం నుంచి వార్తల్లో ఉన్న చిత్రం 'జననాయగన్'. తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ చివరి సినిమాగా రూపొందిన 'జననాయగన్' సెన్సార్ కారణంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్, నాన్–థియేట్రికల్ డీల్స్ విషయంలో విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. జనవరి 9నే 'జననాయగన్' థియేటర్లలోకి రావాల్సిఉంది. అయితే, సెన్సార్ పరమైన కొన్ని ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే ఈ సినిమా నాన్–థియేట్రికల్ ఒప్పందాలు రద్దయినట్లు తెలుస్తోంది. దీనితోపాటు ఇప్పటివరకు జరిగిన అన్ని థియేట్రికల్ అగ్రిమెంట్లను కూడా రద్దు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు అడ్వాన్స్ డబ్బులను తిరిగి ఇచ్చేయాలని విజయ్ నిర్మాతలకు సూచించినట్లు సమాచారం. దీంతో నిర్మాణసంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ మీటింగ్ ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. సినిమా విడుదల తేదీ ఖరారైన తర్వాత సొంతంగా రిలీజ్ చేసుకోవాలని విజయ్ సలహా ఇచ్చారట. హెచ్.వినోద్ దర్శకత్వంలో సామాజిక కథాంశంతో రూపొందిన చిత్రం 'జన నాయగన్'. ఈ పొలిటికల్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది. ఇందులో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించారు. మమితా బైజూ, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తెలుగు హిట్ సినిమా 'భగవంత్ కేసరి' ఆధారంగా రూపొందినట్లు గతంలో వార్తలు వచ్చాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com